క్లుప్తంగా

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

అద్దంకి రూరల్: సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం ప్రచార భేరి పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ బాపట్ల కార్యదర్శి తన్నీరు శింగరకొండ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనం పేందుకు ప్రచార భేరి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే ప్రచార భేరిలో భాగంగా 17వ తేదీ మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు అద్దంకిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రచారభేరిని ప్రారంభించి పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి సాయంత్రం ఆరు గంటలకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ముగింపు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, అద్దంకి మండల నాయకులు కేఎల్‌డీ ప్రసాద్, సీపీఎం మండల నాయకుడు గుంజి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో నేత్రదానం



శ్రీనివాసరావు (ఫైల్)

చినగంజాం: ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో బొల్లాపల్లికి చెందిన ముద్దన శ్రీనివాసరావు (60) మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు అంగీకారంతో సేకరించారు. గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి), క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్ భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణలు కుటుంబ సభ్యులు తేజస్విని, వేణుబాబు, వెంకట్రావులకు అభినందనలు తెలిపారు. ఇది క్లబ్ 498వ నేత్రదానంగా వారు చెప్పారు.

నేడు వీరాంజనేయస్వామికి లక్ష దళార్చన



వీరాంజనేయ స్వామి మూలవిరాట్

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామ పొలిమేర నందు స్వయంభువుగా వెలసిన పొలిమేర వీరాంజనేయ స్వామికి 17వ తేదీ సోమవారం స్వామి జన్మ నక్షత్రం పూర్వాభాద్రను పురస్కరించుకొని లక్ష నాగవల్లి దళార్చన (తమలపాకు పూజ) నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జగద్గురు మహాసంస్థానం దక్షిణామ్నాయ శారదా పీఠం శృంగేరి పాలిత దేవాలయంలో పీఠం సాంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూజా కార్యక్రమాలను చిడిపూడి ప్రభాకరరెడ్డి, రాజకుమారి దంపతులతో పాటు వారి కుమార్తెలు భార్గవి, జ్యోతిల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అళహరి రాంబాబు, రమేష్, విష్ణురామచైతన్య, తిరుపతి రవిచంద్ర, రుత్వికులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిందిగా వారు కోరారు.

అమ్మవారికి వెండి ఆభరణాలు బహూకరణ

చినగంజాం: సోపిరాల గ్రామంలో వేంచేసియున్న లలితారామకోటేశ్వర స్వామి దేవాలయం నందు లలితా అమ్మవారికి దాతలు ధర్మవరపు ఏసునారాయణ, భాగ్యమ్మ దంపతులు వెండి అభరణాలను బహూకరించారు. సుమారు రూ. 1 లక్ష విలువ కలిగిన వెండి కవచం, వెండి కిరీటం, కర్ణపత్రాలను వారు ఆలయంలో ఆలయ అర్చకులు శంకరమంచి హనుమంతరావుకు అందజేశారు. ఇందులో భాగంగా దాతలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం . ఉత్తరాయణం చైత్ర మాసం శతభిషం నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



ఆదిపూడిలో స్టిక్కర్లు అంటిస్తున్న నాయకులు



చింతగుంపలలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ప్రజా ప్రతినిధులు, గృహసారథులు



కూకట్లపల్లిలో ప్రభుత్వ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న మండల ఉపాధ్యక్షుడు



మేదరమెట్లలో జగనన్నేమా భవిష్యత్ కార్యక్రమంలో నాయకులు



ధేనువకొండలో గృహిణితో మాట్లాడుతున్న నాయకులు

● ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్

అద్దంకి/మేదరమెట్ల/బల్లికురవ: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. అద్దంకి మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నతోనే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా కూకట్లపల్లి, అంబడిపూడి, ముక్తేశ్వరం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. 'మా భవిష్యత్ జగనన్నే–మా నమ్మకం నువ్వే' స్టిక్కర్లను లబ్ధిదారుల అనుమతితో ఇంటింటికి అంటించారు. సచివాలయ కన్వీనర్లు కె. శంకరరెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

● జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మా నమ్మకం నేవ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు, స్థానిక నాయకులు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. మేదరమెట్లలో సచివాలయం–2 పరిధిలో స్థానిక నాయకులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు.

● అద్దంకి మండలంలోని ధేనువుకొండ గ్రామంలో సొసైటీ ప్రెసిడెంట్ రామిరెడ్డి ఆదిరెడ్డి, వలంటీర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారితో ఏ ప్రభుత్వం హయాంలో పాలన బాగుందో అడిగి, వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మా భవిష్యత్‌కు భరోసా జగనన్నే..

కారంచేడు/చినగంజాం: మా కుటుంబాల బంగారు భవిష్యత్‌కు భరోసా జగనన్నే అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండలంలోని దగ్గుబాడు గ్రామంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు. మండలంలోని ఆదిపూడి ఎస్సీ కాలనీ, మొయిన్ రోడ్డులోను మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

● మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా చినగంజాం మండలంలోని చింతగుంపల గ్రామంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, పర్చూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరణం రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో ప్రభుత్వ పథకాలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో గడప గడపకు తిరుగుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా సమస్యలు ఏమైనా ఉంటే వారిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో స్టిక్కర్‌లను అంటిస్తూ 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ డాలు శ్యాంబాబు, బెజ్జం ఇస్సాక్, గేరా నాగయ్య, డాలు నాగయ్య, చల్లా పీటర్ పాల్, వార్డు సభ్యులు బెజ్జం రాణి, చల్లా లాజర్, కాటుకూరి పద్మ, ధర్మారావు, గ్రామ వలంటీర్‌లు ప్రవీణ్, చిన్నసుబ్బారావు, రామకృష్ణ, హెప్సిబా, దానకుమారి, బ్రహ్మాంజలి, ఐజాక్, కళ్యాణ్, గృహ సారథులు దార్ల కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగాభవానీ అమ్మవారు



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ



కారంచేడు: విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ప్రభ



బల్లికురవ: గంగమ్మ సన్నిధానంలో పొంగళ్లు పెడుతున్న భక్తులు



శిడిమహోత్సవానికి తరలుతున్న పెళ్లికొడుకు



శిడిమహోత్సవంలో మేకపిల్ల ఊరేగింపు

కారంచేడు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి జగజ్జననీ గంగాభవానీ అమ్మవారి 36వ వార్షికోత్సవ తిరునాళ్ల ఆదివారం సాయంత్రం నుంచి అంగరంగ వైభవంగా జరిగాయి. మండలంలోని పుట్టాయిపాలెంలో కొలువైన గ్రామ దేవత, గంగాభవానీ అమ్మవారి తిరునాళ్ల, శిడి మహోత్సవంలో భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఉదయం నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి విశేష పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు జలబిందెలను ఎత్తుకొని డప్పువాయిద్యాలతో ఆలయ ప్రాంగణానికి చేరి తమ మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రకాల విన్యాసాలతో బాకాలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం శిడి పెళ్లి కొడుకును కనక తప్పెట్లు, కోలకర్రలతో యువకుల నృత్యాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వచ్చి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గుడి వద్ద ఉన్న శిడిమానుపై భాగంలో ఒక పెట్టెలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి ఆ మేకపోతును భక్తులు జీడి కాయలతో కొట్టి తమ విశ్వాసాన్ని చాటుకున్నారు. శిడిమాను లాగితే కష్టాలు తొలగిపోతాయనే విశ్వాసంతో భక్తులు శిడిమాను బండిని లాగేందుకు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో విద్యుత్ ప్రభను, 40 అడుగుల అమ్మవారి డిజిటల్ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో కారంచేడు ఎస్సై ఎం అనిత తన సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జెయింట్‌వీల్, తదితర సామగ్రి భక్తులను విశేషంగా ఆకర్షించాయి.

ఘనంగా కొప్పరపాలెం గంగమ్మ, నాగరాజుల తిరునాళ్ల ..

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం గ్రామ సమీపంలో వేంచేసిఉన్న గంగమ్మ, నాగరాజుల వార్షిక తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాలైన సోమవరప్పాడు, కోటావారిపాలెం, మల్లాయపాలెం, సజ్జాపురం గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు పెట్టి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. అనేక మొక్కుబడి ప్రభలు అమ్మవారి సన్నిధికి చేరాయి. రాత్రికి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో రెండు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలపై సాంస్కృతిక కార్యాక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశారు. బల్లికురవ ఎస్సై వీ. వేమన సిబ్బందితో శాంతి, భద్రతలను పరిశీలించారు.

జగనన్న పాలనలోనే బీసీలకు రాజ్యాధికారం

● నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్



ఆమంచితో కారంచేడు పీఏసీఎస్ చైర్‌పర్సన్, డైరెక్టర్లు

కారంచేడు: బీసీలకు రాజ్యాధికారం మన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే సాధ్యమైందని చీరాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం ఆయన ఆయన పందిళ్లపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో కారంచేడు పీఏసీఎస్‌కు చైర్‌పర్సన్, డైరెక్టర్లు ఆమంచిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ కారంచేడు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పడినప్పటి నుంచి ఒక్కసారి కూడా బీసీ సామాజిక వర్గానికి చైర్‌పర్సన్ హోదా ఎవ్వరికీ ఇవ్వలేదన్నారు. మొదటిసారిగా కారంచేడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా కారంచేడు గ్రామానికి చెందిన పులి గంగరాజును ఎంపిక చేశామన్నారు. అలాగే డైరెక్టర్‌లుగా అదే గ్రామానికి చెందిన స్వర్ణ శ్రీనివాసరావును, యార్లగడ్డ శ్రీకాంత్‌ను ఎంపిక చేశామన్నారు. ఒక్క కారంచేడులో మాత్రమే కాదని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు రాజ్యాధికారం నిలబెట్టేందుకు ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్‌తో పాటు, డైరెక్టర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం

జే.పంగులూరు: పేదలకు అవసరమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురాటమే గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక లక్ష్యమని, ప్రముఖ వైద్యుడు డాక్టర్ మంచాల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పంగులూరు గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రజాసంఘాల నాయకుడు రాయిని వినోద్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం చాలా ఖరీదుగా మారిపోయిందని, వైద్యమంతా కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. శ్రమజీవుల ఆరోగ్యం కాపాడేందుకే గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక వైద్య సేవలు అందిస్తుందన్నారు. హైద్రాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం మాజీ కార్యదర్శి వై సిద్ధయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో నడుస్తున్న ఈ ఆరోగ్యం సంక్షేమ హెల్త్ మరింత ముదుకు పోవాలని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్ ముందంజ



మాట్లాడుతున్న క్లబ్ సభ్యురాలు అన్నపూర్ణ

అద్దంకి రూరల్: సేవా కార్యక్రమాల నిర్వహణలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ముందంజలో ఉంటుందని క్లబ్ కేబినెట్ సెక్రటరీ వూటుకూరి ఉమఅన్నపూర్ణ అన్నారు. ఆదివారం స్థానిక చుండూరి రామసుశీల నిలయంలో వీ205వ జిల్లా ద్వితీయ మైక్రో కేబినెట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 6,7 తేదీల్లో శ్రీశైలంలో లీడర్‌షిప్ క్వాలిటీని పెంచే శిక్షణ కార్యక్రమం నిర్వహించనున నట్లు తెలిపారు. జిల్లాలోని క్లబ్బులు చలివేంద్రాలను ఏర్పాటు, కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిద్దా సూర్య ప్రకాష్‌రావు, అమరా సుబ్బారావు, కునాల సుదర్శన్, బాల వెంకట సత్యనారాయణ, వైస్ గవర్నర్ చేబ్రోలు సురేష్‌బాబు, గ్రంథి లక్ష్మి నాగరాజ కుమార్, ట్రెజరర్ వైశాలి వెంకట అనంత సుజాత, అద్దంకి వాసవి, వాసవీ వనిత క్లబ్ అధ్యక్షులు ఆత్మకూరి ఆంజనేయులు, ఆత్మకూరి శిరీషా, వాసవి క్లబ్ ట్రెజరర్, గొల్ల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



ఆదిశేషు భార్యకు నగదు అందిస్తున్న స్నేహితులు, అధ్యాపకులు

చీరాల టౌన్: తమతో పాటు చదువుకున్న ఓ మిత్రుడు అకాల మరణం చెందడంతో కుటుంబాన్ని తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఆదివారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలోని హస్తినాపురంలో నివశిసించే తమ మిత్రుడి కుటుంబానికి స్నేహితులు, అధ్యాపకులు కలిసి సేకరించిన రూ.2 లక్షల నగదును మిత్రుడు కుటుంబానికి అందించారు. వివరాల్లోకెళ్తే హస్తినాపురానికి చెందిన పృథ్వీ ఆదిశేషు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీ సికింద్రాబాద్ 2000 బ్యాచ్‌కు చెందిన మిత్రులు వెంకటేశ్వర్లు, రామారావు, అనురాధా, సతీష్, తిరుపతి, నాగేశ్వరరావు, మాధవీలత కలిసి సేకరించిన రూ.2 లక్షల నగదును మిత్రుడి భార్య నాగలక్ష్మీ, పిల్లలకు అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. తమ మిత్రుడు అకాల మరణంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మిత్రుడి కుటుంబానికి అండగా ఉన్నామని భరోసా కల్పించారు. దీంతోపాటు ఆర్థిక సాయాన్ని అందించడంతో ఆదిశేషు మిత్రలు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

చినగంజాం: వివాహిత మహిళ అదృశ్యంపై చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదయింది. ఎస్సై కట్టా అనూక్ వివరాల మేరకు.. మండలంలోని పూలవారిపాలెం గ్రామానికి చెందిన రాచూరి తిరుపతమ్మ ఆరోగ్య సమస్యపై వైద్య చికిత్స నిమిత్తం ఈనెల 3వ తేదీ హైద్రాబాద్ వెళ్లింది. ఆమె భర్త రాచూరి రాము ఆమె ఆచూకీ కోసం బంధువులను, పరిచయస్తులను విచారించి ఫలితం లేకపోవడంతో ఆదివారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పుస్తక పఠనంతో మరింత విజ్ఞానం



మాట్లాడుతున్న లైబ్రేరియన్ భాస్కరరెడ్డి

అద్దంకి: పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందని సంతమాగులూరు గ్రంథాలయ లైబ్రేరియన్ బీ విజయభాస్కరరెడ్డి అన్నారు. ఆయన సోమవారం గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో పుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలతోపాటు, వివిధ రకాల పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం, ఎన్నో విషయాలు, గొప్పగొప్ప వాళ్లు ఎలా అయ్యారో తెలుసుకుని వారి మార్గంలో నడిచి అంతటి వారు కావచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.